# రాజకీయ విలువలకు దర్పణం 'టంగుటూరి'

(కల్చరల్ కంట్రిబ్యూటర్)

విశాఖపట్నం, అక్టోబరు 22 (న్యూస్‌టుడే): 'మనిషి నేర్చుకోవలసిన మొదటిగుణం కృతజ్ఞత. దేశానికి పనికివచ్చే మంచిపనులు చెయ్యి' అన్న మాతృమూర్తి మాటలను వేదవాక్కులా భావించి జీవితాంతం ఆచరణలో పెట్టిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు ఆ.ని 'ప్రజానాయకుడు ప్రకాశం' చారిత్రక నాటకంలోని వివిధ ఘట్టాలు తెలిపాయి. హైదరాబాదుకు చెందిన రసరంజని కళాకారులు రచయిత ఎం. నాగభూషణశర్మ దర్శకత్వంలో ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. విశాఖ సిటీ పోలీస్ కల్చరల్ అకాడమీ, విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశాయి. వ్యయ ప్రయాసలకోర్చి హైదరాబాదు నుంచి వచ్చిన సుమారు 60 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు ఈ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించి కరతాళధ్వనులందుకున్నారు. వందేమాతరం గీతంతో హృద్యంగా ప్రారంభమైన ఈ ప్రదర్శనలో ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన ప్రకాశం పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బులేక తల్లి పూజచేసేటప్పుడు వేసుకునే పట్టు బట్ట తాకట్టుపెట్టి ఆ 3 రూపాయలు తీసుకురావడం చూసి చలించిపోవడం, లక్షలాది రూపాయలు ఆర్జించిపెట్టే న్యాయవాద వృత్తిని వదలిపెట్టి స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకోవడం, ఎన్ని అడ్డంకులెదురైనా తనదైన శైలిలో ప్రప్రథమ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, రాజకీయాల్లో ఆస్తులు నష్టపోవడం, సైమన్ కమిషన్‌కి ఎదురునిలిచి కాల్చమని గర్జించడం, సిద్ధాంతాలు నిలబెట్టుకోవడంకోసం రాజీపడక పోవడం మొదలైన సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ప్రకాశం తల్లిగా వేసిన ప్రముఖ నటులు, దర్శకులు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నటన, సంభాషణలు పలికిన తీరు ప్రేక్షకులను ముగ్ధుల్ని చేసింది.



'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకంలోని ఓ సన్నివేశం

నా దేశం, నా కాలం, నా ధనం చివరిపైసకూ ఈ దేశ ప్రజలకోసం వినియోగిస్తాను అన్న ప్రకాశం చివరివరకూ ఆ బాటలోనే నడిచారు. డాక్టర్ జి. రాధాకృష్ణమూర్తి బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి పెద్దలెందరో నటించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీసు కమిషనరు ఎ.కె. ఖాన్, ప్రియ అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టరు జె.ఎస్.వి. ప్రసాదు, విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు సి.ఎస్.ఎన్. రాజు ప్రభృతులు జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో వారు తమ కుటుంబసభ్యులందరినీ తీసుకువచ్చి చివరివరకు ఉండటం విశేషం. డాక్టర్ పేరాల బా[...] మురళీకృష్ణ, కోఆర్డినేటర్ సుంకర ప్రభాకరరా[...] ప్రభృతులు మాట్లాడారు. ఒక మంచి నాటక[...] చూశామన్న తృప్తి కల్గించిందీ ప్రదర్శన.

ఈనాడు- విశాఖపట్నం.

సోమవారం, 23 అక్టోబరు 2